క్లుప్తంగా

రైతులు నానో యూరియా వినియోగించుకోవాలి



పంపిణీ చేస్తున్న ఏఈవో సంజీవ్‌నాయక్

ఇచ్చోడ: రైతులు నానో యూరియా వినియోగించుకోవాలని ఇచ్చోడ ఏఈవో సంజీవ్‌నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సహకార సంఘంలో రైతులకు నానో యూరియా పంపిణీ చేశారు. అర లీటర్ నానో యూరియా రూ. 225కే మార్కెట్లో లభిస్తుందన్నారు. నానో యూరియా పిచికారీ చేయడంతో మంచి ఫలితాలు వస్తాయన్నారు. బస్తాల వినియోగం తగ్గించాలన్నారు. సహకార సంఘం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి నియామకం



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు గజానంద్

సాక్షి ఎఫెక్ట్..

ఇంద్రవెల్లి: మండలంలోని వడగామ్ గ్రామం టీడబ్ల్యూ పీఎస్ పాఠశాలపై ఈనెల 29న 'ఉపాధ్యాయుడు లేక మూత బడి' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం మండలంలోని వడగామ్ పాఠశాలకు గజానంద్ అనే ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్ ద్వారా నియమించి పాఠశాలను తిరిగి ప్రారంభించారు. పాఠశాల ప్రారంభించేందుకు కృషి చేసిన సాక్షికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

నాగోబా ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న నారాయణ మహరాజ్

ఇంద్రవెల్లి: కేస్లాపూర్ నాగోబా ఆలయంలో గురువారం ఇచ్చోడ మండలంలోని మాదపూర్ గ్రామానికి చెందిన నారాయణ మహరాజ్ ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా మెస్రం వంశీయులు శాలువాతో సన్మానించారు. నాగోబా పూజరి మెస్రం శేఖ్‌నాథ్‌తో మాట్లాడి నాగోబా ఆలయ అభివృద్ధి, ఆధ్యాత్మిక వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మెస్రం వంశీయులు, భక్తులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నాయకులు

బజార్‌హత్నూర్: మండలంలోని మాడగూడ గ్రామంలో ఆదివాసీ సేన బజార్‌హత్నూర్ మండల కార్యవర్గాన్ని ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు రాయిసిడం జంగు పటేల్ అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా అత్రం శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా అత్రం రవి, ప్రధాన కార్యదర్శిగా గేడం సోనేరావు, సంయుక్త కార్యదర్శిగా ఉయిక నాందేవ్, కోశాధికారిగా ఆత్రం నాగోరావు, సభ్యులుగా మడవి నగేశ్, కనక శంకర్, అత్రం తెలంగ్‌రావు, మడవి శంకర్, అనక లక్ష్మణ్, కోరెంగ రాజు, అత్రం మనోజ్, అత్రం ఓంప్రకాశ్, అర్క వామన్‌రావు, అత్రం నవనీత్‌లను ఎన్నుకున్నారు. ఆదివాసీ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా కోవ దౌలత్ రావు మొకాశి, ఆదివాసీ సేన జిల్లా ఉపాధ్యక్షుడు ఉయక శ్యాంరావ్, మండడి లక్ష్మణ్, అడేం పోల్లన్న, కోట్నక గణేష్, దుర్వ కోసేరావు పాల్గొన్నారు.

రమేశ్ సేవలు మరువలేనివి

నార్నూర్: గత పదివేలుగా ఐకేపీ ఏపీఎంగా మైన రమేశ్ మండల సమైక్యకు అందించిన సేవలు మరువలేనివని తహసీల్దార్ జాడి రాజలింగు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల సమైక్య భవన్‌లో బదిలీపై వెళ్తున్న ఏపీఎంను ఎంపీడీవో గంగసింగ్‌తో కలిసి సిబ్బంది, సమైక్య సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం ఫైనాన్స్ జ్ఞాను, సీసీలు సంతోష్, సత్యశీల, సంతోష్, కిషన్‌రావు, శ్రీరామ్, రేవయ్య, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

బేల: మండల కేంద్రంలోని గణేష్ గార్డెన్‌లో గురువారం ఎంఈవో కోల నర్సింలు ఉద్యోగ విరమణను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డిలు కోల నర్సింలు దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఖోడంగ్ సందడి



ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు ఆదివాసీ గ్రామాల్లో ఖోడంగ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. గిరిజన గ్రామాల్లో చుక్కల అమావాస్య రోజు అటవీ ప్రాంతం నుంచి తీసుకొచ్చిన వెదురు కర్రలతో ఖోడంగ్ తయారు చేసి ఖోడంగ్‌లతో చిన్నారులు, యువకులు గ్రామాల్లో వీధుల్లో తిరుగుతూ సందడి చేస్తున్నారు. చుక్కల అమావాస్య రోజు నుంచి ప్రారంభమైన ఖోడంగ్ ఉత్సవాలు పొలాల పండుగ వరకు కొనసాగుతాయి.

స్టాల్స్ సరే.. ఉత్పత్తులేవి?



నీతి ఆయోగ్ ఆకాంక్ష బ్లాక్‌లో భాగంగా స్థానిక ఉత్పత్తులపై ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో స్వయం సహాయక సంఘాలు, గిరిజన మహిళలు రూపొందించిన ఉత్పత్తుల ప్రదర్శన ఏర్పాటు చేశారు. కలెక్టర్ రాజర్షి షా సందర్శించిన రోజు పూర్తిస్థాయిలో స్టాళ్లు ఉత్పత్తులతో నిండి ఉండగా గురువారం పలు స్టాల్స్ ఖాళీగా దర్శనమిచ్చాయి. – సాక్షి, ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

జయప్రదం చేయండి

ఆదిలాబాద్‌రూరల్: ఆగస్టు 4న జిల్లా కేంద్రంలోని రెవెన్యూ గార్డెన్‌లో నిర్వహించే దివ్యాంగుల, ఆసరా పెన్షన్‌దారుల గర్జన సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ మాదిగ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో వీహెచ్‌పీఎస్, ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ హాజరు కానున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో ఏర్పడి 18 నెలలు గడిచిన దివ్యాంగులకు, వృద్ధులకు, వితంతులకు, ఒంటరి మహిళలకు బీడి, నేత, గీత, కండరాల క్షీణత వ్యాధిగ్రస్తులకు పెంచుతామన్న పెన్షన్లు పెంచకుండా మోసం చేస్తుందని ఆరోపించారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి సీని యర్ నాయకులు మహబూబ్, నాందేవ్, కనక కిష న్, షేక్ షేకలు, దేవిదాస్, విలాస్, నాందేవ్, వినయ్ సాగర్, గణేష్, మనోజ్, భూమన్న పాల్గొన్నారు.

రోడ్డు పనులు పునః ప్రారంభం



ఇచ్చోడలో ప్రారంభమైన రోడ్డు పనులు

ఇచ్చోడ: మండల కేంద్రంలో అర్ధాంతరంగా నిలిచిన డబుల్ రోడ్డు పనులను ఎట్టకేలకు పునః ప్రారంభం అయింది. నిర్మల్ బైపాస్ నుంచి ఆదిలాబాద్ బైపాస్ వరకు డబుల్ రోడ్డు, డివైడర్, సెంట్రల్ లైటింగ్ నిర్మాణం కోసం రూ. 16 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఏప్రిల్‌లో డబుల్ బీటీ రోడ్డు నిర్మాణం పనులు దాదాపుగా పూర్తయ్యాయి. డివైడర్, సెంట్రల్ లైటింగ్ నిర్మాణం పనులు ప్రారంభించేలోపు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ గుండెపోటుతో మృతి చెందారు. దీంతో ఏప్రిల్ నుంచి పనులకు బ్రేక్ పడింది. ఎట్టకేలకు గత రెండు రోజుల నుంచి కాంట్రాక్టర్ బంధువులు పనులు ప్రారంభించారు.

వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ నిఖిల్ రాజ్

భీంపూర్: ప్రభుత్వం అందజేసే వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి నిఖిల్ రాజ్ సూచించారు. గురువారం మండలంలోని గుంజాల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. వర్షాకాలం నేపథ్యంలో అంటురోగాలు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వైద్య విస్తరణ అధికారి జ్ఞానేశ్వర్, ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్ రెడ్డి, స్టాఫ్ నర్స్ ఉమా, సాయి కిరణ్, సంతోషిని పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

నేరడిగొండ: నేరాల నియంత్రణ చర్యల్లో భాగంగా నేరడిగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద గురువారం సాయంత్రం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఇచ్చోడ సీఐ రాజు, ఎస్సై ఇమ్రాన్ పర్యవేక్షణలో నేరడిగొండ పోలీసులు ప్రతీ వాహనాన్ని ఆపి తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తులను, సరుకులను పరిశీలించారు. ప్రజల భద్రత కోసం తరచూ తనిఖీలు చేపట్టడం జరుగుతుందని సీఐ, ఎస్సైలు పేర్కొన్నారు.

తాంసి: తలమడుగు మండలంలోని లక్ష్మీపూర్ అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద గురువారం సాయంత్రం వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిందర్ ఆధ్వర్యంలో ఎస్సై రాధిక, ఆర్ ఎస్సై విజయ్‌తో కలిసి నాకాబందీలో భాగంగా వాహనాలు తనిఖీ చేశారు. మహారాష్ట్ర నుంచి వస్తున్న ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి జిల్లాలోకి అనుమతించారు. అనుమతి లేని సరుకులు తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆదిలాబాద్‌రూరల్: జాతీయ రహదారి 44పై మావల సమీపంలో ఆదిలాబాద్ రూరల్, మావల పోలీసులు తనిఖీలు నిర్వహించారు. సీఐ కర్రె స్వామి, రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్సై విష్ణు వర్ధన్‌లు వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. ప్రతిఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు.

క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

నార్నూర్: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. మండల ప్రాంతీయ స్థాయి పోటీలతో పాటు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణిస్తున్నారు. గత నెల 28న జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఈఎంఆర్ఎస్ విద్యార్థులు సత్తా చాటినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ అంజేయులు, పీఈటీలు రాంచందర్, కీర్తి కౌసిక్‌లు తెలిపారు. వివిధ క్రీడల్లో పతకాలు సాధించిన విద్యార్థులను గురువారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈనెల 3, 4వ తేదీల్లో హన్మకొండ జేఎన్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాఠశాల చెందిన విద్యార్థులు ఎల్లయ్య, నాగేశ్వరీ, కల్పనలు పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమన్నారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ ఓదేలు, ఉపాధ్యాయులు సాహిల్ మహాజన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు భేష్

- ట్రెయినీ కలెక్టర్ సలోని చాబ్రా



నీటికుంటను పరిశీలిస్తున్న ట్రెయినీ కలెక్టర్

నార్నూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో అధికారులు అమలు తీరు భేష్ అని ట్రెయినీ కలెక్టర్ సలోని చాబ్రా అన్నారు. గురువారం మండలంలోని ఉపాధిహామీ పథకం పనితీరు, చేపట్టిన పనులు ఆమె క్షేత్రస్థాయికి వెళ్లి నీటి కుంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరు బాగుందన్నారు. అధికారులు ప్రజల సమన్వయంతో పని చేయాలన్నారు. ఆమె వెంట ఎంపీడీవో గంగాసింగ్, ఈజీఎస్ ఏపీవో సురేందర్ రాథోడ్, టీఏలు కైలాస్ నాయక్ జాదవ్, సచిన్ ఉన్నారు.

రాకపోకలు సాగించేదెలా?



ఆదిలాబాద్ పట్టణంలోని మహలక్ష్మివాడ, చిల్కూరిలక్ష్మినగర్ కాలనీల ప్రజలు వెళ్లేందుకు మహాలక్ష్మివాడ సమీపంలో నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నీరు నిలిచి ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వర్షపునీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో ప్రతీ ఏటా అవస్థలు తప్పడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి, ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో రమేశ్

బోథ్: ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని, ప్రభుత్వం నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉందని బోథ్ ఎంపీడీవో రమేశ్ అన్నారు. గురువారం పొచ్చెర గ్రామంలో పర్యటించారు. ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. మూత్రశాలల నిర్మాణం మధ్యలోనే ఆగిపోవడంతో పనుల తొందరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఎంపీవో, అతుల్ ఉన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన హైకోర్టు రిటైర్డ్ జడ్జిలు



వివాహానికి హాజరైన హైకోర్టు రిటైర్డ్ జడ్జిలు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం జరిగిన వివాహ వేడుకలకు హైకోర్టు రిటైర్డ్ జడ్జిలు హాజరయ్యారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ అశోక్– విజయలక్ష్మి దంపతుల కుమారుడు సాయిరాం మహతి పెండ్లి వేడుకలకు హైకోర్టు రిటైర్డ్ జడ్జిలు జస్టిస్ వామన్‌రావు, జస్టిస్ చంద్రకుమార్, జస్టిస్ చంద్రయ్యలు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

నేడు రేషన్ కార్డుల పంపిణీ

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని కాగ్నే ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో పాటు కలెక్టర్ రాజర్షిషా, ఉట్నూర్ సభ కలెక్టర్ యువరాజ్ మర్మాట్‌లు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రాంజీగోండు సేవా సమితి అధ్యక్షుడిగా పరమేశ్వర్

నార్నూర్: రాంజీగోండు సేవా సమితి మండల అధ్యక్షుడిగా మండలంలోని బలాన్‌పూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఆత్రం పరమేశ్వర్‌ను ఏకగ్రీవంగా నియమించినట్లు స్టీరింగ్ కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. గురువారం మీడియాతో మాట్లాడుతూ ఆదివాసీ గిరిజన సంక్షేమం కోసం పని చేస్తామన్నారు. జల్ జంగల్ జమీన్ అనే నినాదాలు అనుసరిస్తూ ఆదివాసీల హక్కుల కోసం పోరాడుతామన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ఆదిలాబాద్: మెగా జాబ్‌మేళాల నేపథ్యంలో నిరుద్యోగులు అప్రమత్తంగా ఉండాలని సార్క్ మానవ హక్కుల సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి నీరటి ఉదయ్ కిరణ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గతంలో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన జాబ్‌మేళాలో ప్రముఖ కంపెనీ పేపర్ ప్రకటన చేసి 100 ఉద్యోగాలు భర్తీ చేస్తున్నట్లు వెల్లడించిందన్నారు. అయితే ఇందులో దాదాపుగా 200 మంది నిరుద్యోగులు ఇంటర్వ్యూకు హాజరయ్యారని, వారికి ఉద్యోగాలు ఇవ్వకుండా కేవలం ఏజెంట్లుగా పెట్టుకుంటామని చెప్పి సదరు కంపెనీ మోసం చేసిందన్నారు. ఇటువంటి మోసపూరిత ఉద్యోగ ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మి

తాంసి: విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని తాంసి తహసీల్దార్ లక్ష్మి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. ఆరోగ్యంతో పాటు చదువులో రాణిస్తూ పరీక్షల్లో ఉత్తమ మార్కులను సాధించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీకాంత్, ఉపాధ్యాయులు సతీష్, గితేష్, వైద్య సిబ్బంది లక్ష్మి, ప్రభావతి పాల్గొన్నారు.

మత్తుకు దూరంగా ఉండాలి

తాంసి: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తాంసి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ విద్యార్థులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మత్తు, డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. డ్రగ్స్ వాడటం వలన ఆరోగ్యం దెబ్బతిని జీవితాలను నాశనం అవుతాయని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సంతోశ్, అధ్యాపకులు తిరుపతి, రెడ్డి, దేవేందర్, శశికుమార్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: చదువుతోనే మంచి భవిష్యత్ ఉంటుందని, విద్యార్థులు చదువుల్లో రాణించి అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకోవాలని సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని 170 కాలనీలో గల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. అదేవిధంగా అంగన్‌వాడీ చిన్నారులకు పలకలు అందజేశారు. కార్యక్రమంలో సుజాత్ అలీ, వేముల నాగరాజు, ప్రసాద్, ఆశన్న యాదవ్, భూమారెడ్డి, యశ్వంత్, నారాయణ, ప్రధానోపాధ్యాయుడు నవీన్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

'హామీల అమలులో కాంగ్రెస్ విఫలం'



మాట్లాడుతున్న మెట్టు ప్రహ్లాద్

ఆదిలాబాద్‌రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్ ఆరోపించారు. గురువారం మావల మండలంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రజలకు అండగా ఉంటూ వాటి సాధన కోసం కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు చందాల రాజన్న, ఉమాకాంత్ రెడ్డి, సుధీర్, సంతోష్, అజీమ్, నారాయణ, ఆసిఫ్, గంగన్న, కారం రవి, సంజీవ్, అశోక్, గోవర్ధన్, సాగర్ పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

బేల: మండల కేంద్రంలోని తెలుగు మీడియం ప్రాథమిక, ఉర్దూ మీడియం ప్రాథమికోన్నతతో పాటు సిర్సన్న గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తనిఖీ చేశారు. సిర్సన్నలో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి, వారి అభ్యసన సామర్థ్యాలు పరిశీలించారు. వార్షిక పరీక్షలకు ఇప్పటి నుంచే పట్టుదలతో చదవాలన్నారు. బేల ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న ఏఐ తరగతులను పరిశీలించి, కార్యక్రమ నిర్వహణపై ఆరా తీశారు. ఉర్దూ మీడియంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల కొరత ఉందని పోషకులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చిన డీఈవో సాయంత్రం వేరే పాఠశాల నుంచి ముగ్గురు ఉపాధ్యాయులను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు మహాలక్ష్మీ, సదానందం, తదితరులు ఉన్నారు.

లిఫ్ట్ ఇరిగేషన్‌తో పొలాలు సస్యశ్యామలం



లిఫ్ట్ ఇరిగేషన్ డిజిటల్ సర్వేను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నేరడిగొండ: లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా పంట పొలాలు సస్యశ్యామలంగా మారుతాయని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని బుగ్గారం, తేజాపూర్, పొచ్చెర గ్రామాల పరిధిలో చేపట్టిన లిఫ్ట్ ఇరిగేషన్ డిజిటల్ సర్వేలను గురువారం పరిశీలించారు. తేజాపూర్ సమీపంలో సర్వే జరుగుతున్న ప్రాంతాలను సందర్శించిన ఆయన అధికారులతో కలిసి సర్వే పనుల పురోగతిని సమీక్షించారు. పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. బుగ్గారం లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సుమారు 2800 ఎకరాలకు సాగునీరు అందించేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. ఎమ్మెల్యే వెంట నీటిపారుదల శాఖ డిప్యూటీ ఇంజినీర్ భీంరావ్, నాయకులు ఉన్నారు.

నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

ఆదిలాబాద్: బీసీసీఐ నుంచి క్రికెట్ అభివృద్ధికి వచ్చిన నిధులను దుర్వినియోగం చేసిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ జిల్లా ఇన్‌చార్జి నరోత్తం రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాదులోని సీఐడీ కార్యాలయంలో అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి సీఐడీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌లో జరుగుతున్న అవినీతి వలన ఎంతోమంది క్రీడాకారులకు అన్యాయం జరిగిందన్నారు. సదరు బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీసీఏ ప్రతినిధులు జైపాల్, వీరేష్, ప్రేమ్, మహేంద్ర పాల్గొన్నారు.

టీసీ ఇవ్వడం లేదని విద్యార్థి ఆందోళన

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని క్రిసెంట్ డిగ్రీ కళాశాల యజమాన్యం సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో మండలంలోని గట్టెపల్లి గ్రామానికి చెందిన సిడాం గంగాదేవి అనే విద్యార్థి ఆవేదన వ్యక్తం చేసింది. మొదట్లో జిరాక్స్ పత్రాలతో అడ్మిషన్ తీసుకున్న యజమాన్యం ఇప్పుడు కోర్స్ పూర్తయిన తరువాత ఒర్జినల్ టీసీ అడుగుతున్నారని గురువారం విలేకరుల ముందు వాపోయారు. ప్రస్తుతం డిగ్రీ పూర్తయిన తరువాత పై చదువుల కోసం టీసీ, మెమో ఇఅడిగితే ముందుగా ఇంటర్ టీసీ తీసుకొస్తేనే డిగ్రీ పూర్తయినట్లు టీసీతో పాటు మెమో ఇస్తామని చెప్పి కళాశాల చుట్టూ తిప్పించుకుంటున్నారని ఆరోపించారు. టీసీ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. అధికారులు స్పందించి టీసీ ఇప్పించాలని కోరుతున్నారు.

నియామక ఉత్తర్వుల అందజేత



ఉత్తర్వులను అందజేస్తున్న అస్లాం

కైలాస్‌నగర్: ఎస్ఆర్ఎస్ పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడిగా షేక్ మస్తాన్ అలీ, నిర్మల్ పట్టణ అధ్యక్షుడుగా సయ్యద్ ఇఫ్తెఖర్, ఖానాపూర్ మండల అధ్యక్షుడిగా రయిస్‌బేగ్‌లను నియమించినట్లుగా ఆ పార్టీ జోనల్ అధ్యక్షుడు షేక్ అస్లాం తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ.సుబానీ, షేక్ జహీరుద్దీన్, దీపక్ షిండే, తదితరులు పాల్గొన్నారు.